ప్రజాశక్తి
సోమవారం 27, మార్చి 2023 5 అనంతపురం

కర్నాటక రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రైతులు మృతి

బొమ్మనహాల్ : కర్నాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రైతులు మృతిచెందారు. కర్నాటక రాష్ట్రంలో మిరప పంటను విక్రయించేందుకు వెళ్తూ చోటు చేసుకున్న ప్రమాదంలో గోవిందవాడకు చెందిన వన్నూరప్ప (60), కేశవ (40) అక్కడికక్కడే మరణించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి...

మిగతా మెయిన్‌లో

మృతిచెందిన వన్నూరప్ప, కేశవ

గుత్తేదారులా..మజాకా..!

ఇటాచీతో కాలువలోని మురుగును ట్రాక్టర్‌లో వేస్తున్న దృశ్యం

హిందూపురం పురపాలక సంఘంలో గుత్తేదారులదే హవా. చేసిన పనికే మళ్లీ..మళ్లీ ప్రజా ధనాన్ని ఖర్చు చేసే విధంగా పనులు చేస్తున్నారు. ఈ విషయాలు ఇంజినీరింగ్ శాఖ అధికారులకు తెలిసినప్పటికీ వారు ఇచ్చే మామూళ్ల మత్తులో జోగుతున్నారే తప్ప ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీనికి నిదర్శనం పురపాలక సంఘ పరిధిలోని ధర్మపురం మీదుగా సూరప్పకుంట చెరువు నుంచి కొట్నూరు చెరువుకు అనుసంధానంగా ఉన్న నీటి పారుదల శాఖకు చెందిన ప్రధాన కాలువను రూ.16 లక్షలతో శుభ్రం చేయించడమే.

కాలువల్లోని మురుగు చెరువులోకి

దీని కోసం రూ.16 లక్షలు

ప్రజా ధనం వృథా

చెరువులో మురుగు

శుభ్రం చేయడానికి మళ్లీ ఖర్చు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో మురుగు కాలువలను ప్రజలు ఆక్రమించుకుంటే...పురపాలక సంఘం వారు ఉన్న నిధులను దుర్వినియోగం చేస్తున్నారు. పురపాలక సంఘంలో ఎనిమిదేళ్ల క్రితం ఆర్థిక సంఘం నిధులు రూ.3 కోట్లు ఉన్నాయి. వాటిని ఎలాగైనా ఖర్చు చేయాలని అప్పటి మున్సిపల్ కమిషనర్ కొంతమంది గుత్తేదారులతో కలిసి నీటి పారుదల శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా సురప్పకుంట నుంచి కొట్నూరు చెరువుకు అనుసంధానంగా ఉన్న ప్రధాన కాలువకు సిమెంటు పూసి నిధులను దుర్వినియోగం చేశారు. దీంతో పాటు ఈ కాలువకు చిన్న చిన్న కాలువలను అనుసంధానం చేయడం వల్ల గత సంవత్సరం కురిసిన వర్షాలకు అన్ని చెరువుల మరువలు పారాయి. వరద నీరు రోడ్డుపైకి వచ్చింది. ముక్కడి పేట, ఆర్‌టిసి కాలోని, ఆబాద్‌పేట, చైతన్యనగర్, బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ఆ సమయంలో పురపాలక సంఘం వారు నీటి పారుదల శాఖ వారిదే తప్పు అన్నట్లు చూపించి చేతులు దులుపుకున్నారు. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వానికి పోలవరం ప్రాజెక్ట వరం అయితే, హిందూపురం పురపాలక సంఘం అధికారులకు, పాలకులకు, గుత్తేదారులకు కాలువలు వరంలా నిలిచాయి. ప్రతి సారీ కాలువల శుభ్రం పేరుతో లక్షలాది రుపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు.

విచ్చలవిడిగా నిధుల దుర్వినియోగం

హిందూపురం పురపాలక సంఘంలో పారిశుధ్యం కోసం నెలకు సుమారు రూ.50 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు ప్రధాన కాలువలు శుభ్రం పేరుతో సాధారణ నిధులను ఆసాధారణంగా ఖర్చు చేస్తున్నారు. పారిశుధ్య విభాగంలో 220 మంది కాంట్రాక్టు కార్మికులతో పాటు పర్మినెంట్ కార్మికులు, ట్రాక్టర్లు, జెసిబిలతో పాటు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ఉన్న కార్మికులు, సౌకర్యాలను ఉపయోగించుకుని కాలువలను శుభ్రం చేయించాల్సి ఉంది. అయితే వాటిని ఉపయోగించకుండా పెద్ద కాలువలను గుత్తేదారులకు అప్పగించి లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని సక్రమైన పద్ధతిలో దుర్వినియోగం చేస్తున్నారు. వేగవంతంగా పనులు పూర్తి చేయాలని గుత్తేదారులకు అప్పగించినప్పటికీ దానికి తప్పని సరిగా కొన్ని నిబంధనలు ఉంటాయి. కాలువలోని మరుగు బయటకు వేసి, ఆ మురుగు బాగా ఎండిన అనంతరం దానిని సుదూర ప్రాంతాలకు తరలించాల్సి ఉంటుంది. అయితే ఇలా చేయకుండా ఇటాచి సహాయంతో కాలువలోని మురుగును తీసి ట్రాక్టర్ ద్వారా సూరప్పకుంట చెరువు, కొట్నూరు చెరువుల్లోకి వేస్తున్నారు. కనీసం తరలించే సమయంలో అయినా జాగ్రత్తలు పాటిస్తున్నారా అంటే అదీ లేదు. కాలువ వద్ద మురుగును లోడ్ చేసుకుని చెరువు వరకు రోడ్డు వెంబడి ఆ మురును వేసుకుంటూ పోతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు పురపాలక సంఘ అధికారులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఒక్క పైసా సైతం ఖర్చు కాని పనికి రూ.16 లక్షలు దుర్వినియోగం చేస్తున్నారు. తీసిన మురుగును చెరువులోకి వేయడం వల్ల మళ్లీ చెరువు పూడిక పేరుతో ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్నారు.

కిలోమీటర్ పరిధిలో ఎక్కడైనా వేయొచ్చు

కాలువలోని నుంచి తీసిన మురుగును తీసిన ప్రాంతం నుంచి ఒక కిలోమీటర్ పరిధిలో ప్రజలు అభ్యంతరం తెలుపని చోట ఎక్కడైనా వేయవచ్చు. అదే విషయాన్ని గుత్తేదారులకు చెప్పాం. అయితే చెరువులో వేయరాదని గుత్తేదారులకు సూచించాం.

- సురేష్ అసిస్టెంట్ ఇంజినీయర్

గొర్రెలు, మేకల పెంపకానికి కేంద్రం చేయూత

నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా రూ.50 లక్షలు సబ్సిడీ

యూనిట్ కాస్ట్ రూ.12 లక్షల నుంచి రూ.కోటి వరకు

అన్ని సామాజిక వర్గాలవారూ అర్హులే

జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వై.సుబ్రమణ్యం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పాడి పరిశ్రమ, మాంసం ఉత్పత్తులు పెంపుదల చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ (ఎన్ఎల్ఎం) పథకం ద్వారా కోళ్ల , గొర్రెలు, మేకలు, ఆవులు, పందులు పెంపకానికి చేయూత అందిస్తోంది. యూనిట్ విలువ రూ.12 లక్షల నుంచి రూ.కోటి వరకు రుణం పొందవచ్చు. అందులో ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ అందిస్తూ ప్రోత్సహిస్తోంది. ఈ పథకం కింద అన్ని కులాలు, మతాల వారు రుణం పొందవచ్చు. ఈ పథకం అమలులో ఉండి 2 సంవత్సరాలు కావస్తున్నా జిల్లాలో ఇద్దరు అభ్యర్థులు మాత్రమే యూనిట్ నెలకొల్పుతున్నారు. గుత్తిలో ఒకరు, శ్రీసత్యసాయి జిల్లాలో మరొకరు యూనిట్ ఏర్పాటు చేస్తున్నారు. 44 మంది రుణాలకు దరఖాస్తు చేసుకున్నారు. యువత స్వశక్తితో ఎదిగేందుకు చక్కటి అవకాశాన్ని కేంద్రం కల్పిస్తోంది. జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వై.సుబ్రమణ్యం ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : ఏ యూనిట్‌కు రుణాలు ఇస్తారు ?

జవాబు : నేషనల్ లైవ్ మిషన్ ద్వారా రూ.కోటి విలువ గల యూనిట్ ఏర్పాటు కోసం రుణం పొందవచ్చు. ఆ పథకం ద్వారా ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వం నుంచి రూ.50 లక్షలు సబ్సిడీ ఇస్తారు. రూ.40 లక్షలు బ్యాంక్ రుణం, లబ్ధిదారుడి వాటా రూ.10 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ యూనిట్ కింద 500 గొర్రెలు, 25 పొట్టేళ్లు ఇస్తాం.

ప్రశ్న : అంత కంటే తక్కువ రుణాలు ఇస్తారా ?

జవాబు : రూ. కోటి యూనిట్ ఏర్పాటుకు లబ్ధిదారులు ఆసక్తి చూపకపోవడంతో ప్రభుత్వం మార్పులు చేసింది. యూనిట్ కాస్ట్ ఎక్కువగా ఉండడంతో బ్యాంకులు ష్యూరిటీ లేకుండా లోన్లు ఇవ్వడం లేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఎన్ఎల్ఎం నిబంధనలు సడలించి సులభతరం చేసింది. కొన్ని మార్పులు చేసి యూనిట్లను ఐదు విభాగాలుగా విభజించింది. రూ.12 లక్షల రుణం యూనిట్‌కు 105 గొర్రెలు, రూ.40 లక్షలు యూనిట్‌కు 210 గొర్రెలు, రూ.60 లక్షలకు 315 గొర్రెలు, రూ.80 లక్షల యూనిట్‌కు 420 గొర్రెలు, రూ.కోటి అయితే 525 గొర్రెలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇందులో ఏ యూనిట్ ఎంచుకున్నా 50 శాతం సబ్సిడీ లభిస్తుంది.

ప్రశ్న : ఇతర పశుపక్షాదుల పెంపకానికి రుణం ఇస్తారా ?

జవాబు : నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా గొర్రెలు, మేకలు, పందులు, ఆవులు, దేశవాళి కోళ్లు, వంటి యూనిట్‌లు కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. పందులు, ఆవులను పోషించవచ్చు. ఎన్ని పశువులు పెడితే అంతమేరకు ఆర్థిక సహకారం అందిస్తారు. అన్ని బ్యాంకులు ఎంపిక చేసిన లబ్ధిదారులు మాత్రమే రుణాలు పొందే ఆస్కారం ఉంది. పందుల పెంపకానికి రూ.50 లక్షల వరకు రుణం ఇస్తారు. 50 శాతం సబ్సిడీ ఉంటుంది.

ప్రశ్న : యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వ నిబంధనలు ఏమిటి ?

జవాబు : ఎన్ఎల్ఎం ద్వారా ఏర్పాటు చేయబోయే యూనిట్‌కు కనీసం 5 ఎకరాల భూమి సొంతం, అద్దెదైనా కలిగివుండాలి. సొంతమైతే సంబంధిత పత్రాలు, అద్దెదైతే అద్దె లీజు పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. గొర్రెల పెంపకానికైతే 5 ఎకరాల భూమి ఉండాలి. షెడ్ నిర్మాణం, మేత, పెంపకం వంటి సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలి. ఆ సౌకర్యాలన్నీ పరిశీలించిన తరువాతనే రుణాలు మంజూరవుతాయి.

ప్రశ్న : దరఖాస్తు చేసుకోవడం ఎలా ?

జవాబు : నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకానికి ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. లబ్ధిదారునికి బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, రుణం ఎంత తీసుకోవాలని అనుకుంటున్నారో ఆ మేరకు ష్యూరిటీ, స్థలం పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. బ్యాంకు విల్లింగ్ లెటర్ తీసుకోవాలి. అన్ని గుర్తింపు కార్డులు ఒరిజినల్ డాక్యుమెంట్‌లు ఇవ్వాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో nlm.udyamimitra.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న పత్రాలను జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో సమర్పించాలి.

ప్రశ్న : ఎంపిక విధానం ఎలా ఉంటుంది ?

జవాబు : ఎన్ఎల్ఎంకు రాష్ట్ర స్థాయిలో అనిమల్ హజ్బెండరీ డైరెక్టర్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. లబ్ధిదారుల ఎంపికకు రాష్ట్ర, కేంద్ర స్థాయిలో రెండు కమిటీలు ఉంటాయి. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. బ్యాంకు లోన్ శాంక్షన్ అయిన తరువాత 25 శాతం, యూనిట్ గ్రౌడింగ్ సమయంలో మిగతా 25 శాతం సబ్సిడీ వస్తుంది. బ్యాంకు లోన్ అవసరం లేదనుకుంటే లబ్ధిదారులు సొంతంగా కూడా పెట్టుబడి పెట్టుకోవచ్చు.

చట్ట సభల్లో యువతీ యువకులకు అవకాశం

ప్రతి ఏటా డిసెంబర్‌లో

జాబ్ క్యాలెండర్ విడుదల

టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

యువగళం పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-ఓబులదేవర చెరువు

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే యువతీ యువకులకు చట్ట సభల్లో 40 శాతం అవకాశం కల్పిస్తామని, ప్రతి పేటా డిసెంబర్‌లో జాబ్ క్యాలెండర్ విలడుదల చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. లోకేష్ ఆధ్వర్యంలో చేపట్టిన యువగళం పాదయాత్ర 51వ రోజు శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం ఓబులదేవర చెరువు మండలంలోని సున్నంపల్లి క్రాస్ విడిది కేంద్రం నుంచి ఆదివారం ప్రారంభించారు. మహిళలు ఆయనకు మంగళ హారతులతో స్వాగతం పలికారు. రామయ్యపేటలో లోకేష్ మహిళలతో, గౌనిపల్లిలో ఎస్సీలతో సమావేశమయ్యారు. అల్లపల్లిలో ఆటో వర్కర్లతో భేటీ నిర్వహించారు. పగడాలపల్లిలో యువతతో ముఖాముఖి నిర్వహించారు. పలు సమస్యలను యువకులు, మహిళలు, ఆటో డ్రైవర్లు లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. పార్టీ అధికారంలోకి రాగానే అందరి సమస్యలనూ పరిష్కరిస్తామని లోకేష్ వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. 2024లో టిడిపి గెలుపు ఖాయమని జోష్యం చెప్పారు. టిడిపి హయాంలో అమలుచేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వైసిపి ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. చంద్రబాబు నాయుడు బిసిలకు పెద్దపీట వేశారన్నారు. జగన్ ప్రభుత్వంలో బిసిలకు ఎలాంటి లబ్ధి చేకూరలేదన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే చట్ట సభల్లో యువతీ యువకులకు 40 శాతం అవకాశం కల్పిస్తామని చెప్పారు. విద్యార్థులకు, యువతకు అండగా ఉంటామన్నారు. ప్రతి ఏటా డిసెంబర్‌లో జాబ్ క్యాలెండర్ విడుదల చేసే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఆదాయం పెంచేలా చూడాలన్నారు. ప్రయివేటు సంస్థలను తీసుకురావాలన్నారు. వైసిపి ప్రభుత్వంలో ప్రయివేటు సంస్థలు మన రాష్ట్రంలోకి రాకపోగా.. ఉన్న సంస్థలు పక్క రాష్ట్రాలకు వెళు‌తున్నాయని ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధి శూన్యమని తెలిపారు. సిఎం జగన్‌ను ప్రజలు నమ్మడం లేదన్నారు. సొంత తల్లి, చెల్లి, ఎమ్మెల్యేలు కూడా నమ్మడం లేదని విమర్శించారు. 2024లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని జోష్యం చెప్పారు. నాలుగేళ్ల వైసిపి పాలనలో టిడిపి కార్యకర్తలను అనేక ఇబ్బందులు పెట్టారని, వారికి వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, యువతీ యువకులు పాల్గొన్నారు.

రామయ్యపేటలో మహిళల సమావేశంలో మాట్లాడుతున్న నారా లోకేష్

వినతిపత్రాలను అందజేస్తున్న మహిళలు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏప్రిల్ నుంచి ఉద్యమిస్తాం

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్.సూర్యనారాయణ

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే ఏప్రిల్ నుంచి ఉద్యోగులు ఉద్యమం చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఆర్.సూర్యనారాయణ, ఆస్కరరావు హెచ్చరించారు. ఆదివారం స్థానిక పద్మావతి ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపికృష్ణ అధ్యక్షతన జిల్లా ద్వితీయ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయి ఆర్థిక ప్రయోజనాలు, జీతభత్యాలను క్రమపద్ధతిలో చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యంగా జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ వంటి సేవింగ్స్ ఖాతాల నుంచి రుణసదుపాయం విడుదల చేయకపోవడం పట్ల మూడు సంవత్సరాలుగా ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర కమిటీ తీర్మాణాల ఉద్యోగులకు రావాల్సిన వేతనాలు చెల్లింపు ఫైనాన్స్ కోడ్ 72వ నిబంధనల ప్రకారం 1990 సంవత్సరంలో 223 జిఓ ప్రకారం 1వ తేదీనే విడుదల చేయాలన్నారు. ఉద్యోగ పెన్షనర్‌లకు 11వ పిఆర్‌సి ద్వారా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాల బకాయిలను ఏ నిర్ధిష్ట కాల పరిమితిలోగా చెల్లిస్తారో ప్రభుత్వం తెలియజేయాలన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల జిపిఎఫ్ ఖాతాల నుంచి ఉద్యోగుల అనుమతి లేకుండా విత్ డ్రా చేసిన రూ.480 కోట్ల సొమ్మును తిరిగి వారి ఖాతాల్లో ఎప్పుడు వేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సర్వీసుల నుంచి రిటైర్ అయిన వారికి రావాల్సిన పెన్షన్‌లు, గ్రాడ్యూటీ, ఇతర ఆర్థిక ప్రయోజనాలను నిర్ధిష్ట కాలపరమితి విధించి చెల్లించాలన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు బకాయి పడ్డ డిఏలు, పెన్షనర్‌లకు బకాయిపడ్డ డిఆర్‌లు నిర్ధిష్ట కాలపరిమితిని విధించి చెల్లించాలన్నారు. అరియర్లు ఎప్పటిలోగా ఖాతాల్లో జమ చేస్తారో క్యాష్ రూపంలో ఎప్పుడు చెల్లిస్తారో నిర్ధిష్ట కాల పరమితి విధించి చెల్లించాలన్నారు. ఉద్యోగులకు రావాల్సిన సరెండర్ లీవ్, ఎన్‌క్యాష్‌మెంట్ విధిగా ప్రతి సంవత్సరం ప్రభుత్వం లీవ్ అకౌంట్ ఆధారంగా నిర్ధిష్ట కాలపరిమితికి చెల్లించాలన్నారు. ఉద్యోగులకు చెందాల్సిన ఎల్‌టిసి హోమ్ టౌన్ సదుపాయం కాల పరిమితి అనుమతించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో స్టేషనరీ, కంటిజెన్సీ విధులను నిర్ధిష్ట కాలపరిమితి లోగా ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాలు చెల్లింపుకు నెలల తరబడి సమయం పడుతున్నందున వారి విషయంలో ప్రత్యేకించి వేతనాలు, పెన్షన్‌లు వంటి నికర చెల్లింపుల విషయంలో ఇప్పటి వరకు ఇతివిధమైన చట్టమేమి లేనందున వాటి అమలు కోసం అవసరమైతే బడ్జెట్ సమావేశాల్లోనే ఒక చట్టాన్ని రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రంలో ప్రాతినిధ్యం వహిస్తున్న అన్ని రాజకీయ పక్షాలు, శాసనసభ్యులకు, శాసనమండలి సభ్యులకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లేర్ చేయడంలో జరిగిన జాప్యం రీత్యా 9 నెలల కాలానికి పూర్తి స్థాయి వేతనాలు చెల్లించాలన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు ప్రభుత్వ వాటాతో కలిసి 20వ తేదీలోపు కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ప్రతినెలా చెల్లించాలని కోరారు. సమస్యలు పరిష్కరానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఏప్రిల్ నుంచి నిర్వహిస్తున్న ఉద్యమాన్ని నిలుపుదల చేయించేలా ప్రభుత్వం పరిష్కరిస్తే బాగుంటుందన్నారు. లేని పక్షంలో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామునాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకాంత్‌రాజు, లక్ష్మీపతి, రాష్ట్ర కార్యదర్శి ఎస్.బాబాద్దీన్, విజయ్‌కుమార్, కిషోర్, రఘు, రామనాయుడు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌కుమార్, సుందర్శన్‌రెడ్డి, నరసింహులు, నాగేంద్రప్ప, బంగి శ్రీధర్, రవిశంకర్, భాస్కర్‌రెడ్డి, బాబా ఫక్రుద్దీన్, సాంబశివమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల నిర్లక్ష్యమే రమాదేవి హత్యకు కారణం

ఘటనా స్థలంలో మందకృష్ణ మాదిగ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే దళిత యువతి రమాదేవి హత్య జరిగిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. రమాదేవి హత్య జరిగిన ప్రదేశాన్ని మందకృష్ణ మాదిగ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రమాదేవిని నార్పల మండలం నడిమిదొడ్డి గ్రామానికి చెందిన జాఫర్ కిడ్నాప్ చేశాడని 20 క్రితం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం బాధాకమరన్నారు. అంతేగాకుండా బాధితులనే పోలీసులు బెదిరించి నిందితుడికి వత్తాసు పలకడం క్షమించరాని నేరం అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సంబంధిత సిఐ, ఎస్ఐ, గ్రామ పోలీసులను వెంటనే విధుల నుంచి తొలగించడంతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, చిన్న ఆంజనేయులు, బండారు చంద్ర, పెద్దిరాజు, స్వతంత్ర కుమారి, ముత్యాలమ్మ, సునీత, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

యువతి హత్య జరిగిన ప్రదేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

కార్యక్రమంలో మాట్లాడుతున్న విప్ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి

చంద్రన్న టోకరా వేస్తే.. జగనన్న ఆసరా కల్పించారు..

విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-డి.హీరేహాళ్

టిడిపి హయాంలో చంద్రన్న ప్రభుత్వంలో ప్రజలకు టోకరా వేస్తే.. వైసిపి హయాంలో సిఎం జగన్ ప్రజలకు ఆసరా కల్పించారని విప్ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలో ఉన్నప్పుడు ప్రతి మహిళకూ సెల్ఫోన్, విద్యార్థులకు లాప్టాప్ ఇస్తామని చెప్పి మోసం చేశారని గుర్తు చేశారు. అదే జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఆసరా కల్పించడంతోపాటు విద్యార్థులకు లాప్టాప్లు పంపిణీ చేశారన్నారు. అంతేగాకుండా ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సిఎం జగన్కు దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి సిఎం జగన్ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ భాస్కర్బాబు, ఎంపిపి పవిత్ర హొన్నూరుస్వామి, జడ్పిటిసి హసీనాభాను, వైస్ ఎంపిపి లింగప్ప, సర్పంచులు లక్ష్మి శ్రీనివాసరెడ్డి, హనుమంతురెడ్డి, బోయ మల్లికార్జున, నాగరాజు, ఎంపిటిసిలు సురేష్, మహేష్, గోవిందు, వైసిపి మండల కన్వీనర్ వన్నూరుస్వామి, మండల సచివాలయ కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి, నాయకులు జగదీష్, అరుణాచలం, చంద్ర, గన్ని గౌడ, గొల్ల సురేష్, తొండ వెంకటేష్, తదితర నాయకులు, అధికారులు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఒబిసిల మహాధర్నాను విజయవంతం చేయండి

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేంద్రగౌడ్

ప్రజాశక్తి-అనంతపురం

కేంద్ర ప్రభుత్వం వెంటనే ఒబిసి కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28, 29వ తేదీల్లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేంద్రగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాజకీయాలను శాసిస్తున్న ఒబిసి కుల గణన చేపట్టాలని ఎన్నో సంవత్సరాలుగా పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండటం బాధాకరమన్నారు. బీసీల ఓట్లతో గద్దెనెక్కిన బిజెపి ప్రభుత్వంబీసీల ఆత్మ గౌరవానికి భంగం వాటిల్లేలా వ్యవహరించడం బాధాకరమన్నారు. దేశవ్యాప్తంగా 50 శాతం ఉన్న బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ నేటికీ అమలు కావడం లేదన్నారు. ఈక్రమంలో 2021 జనాభా లెక్కల సేకరణలో భాగంగా వెనుకబడిన కులాల వివరాలు సేకరించి రాజకీయ, ఆర్థిక, విద్యారంగాల్లో సమన్యాయం చేకూర్చాలని డిమాండ్ చేశారు. బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఢిల్లీలో చేపట్టనున్న మహాధర్నా అనంతపురం ఉమ్మడి జిల్లాల్లోని బీసీ నాయకులు మేధావులు, మహిళలు, పెద్దఎత్తున తరలివచ్చి మహా ధర్నాను తమ నిరసనతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు

ఘనంగా ఉట్లమాను ఉత్సవం

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని తిక్కస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం ఉట్లమాను పరుషను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించడానికి నార్పల మండలం నుంచే కాకుండా సమీప మండలాలైన యల్లనూరు, పుట్లూరు, బుక్కరాయసముద్రం, తాడిమర్రి, ధర్మవరం, తాడిపత్రి తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో నార్పల పాత బస్టాండు తిక్కస్వామి ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. పరుష సందర్భంగా భజన పోటీలు, ఇరుసు లెత్తే పోటీలు నిర్వహించారు. అంతకుముందు తిక్కస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులందరూ తిక్కస్వామిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా పలురకాల దుకాణాలను ఏర్పాటు చేశారు. ఉట్లమాను పరుష ప్రారంభంలో స్థానిక యువకులు రెండు వర్గాలుగా విడిపోయి పైనుంచి వదులుతున్న టెంకాయను పగులు కొట్టడానికి పోటీ పడ్డారు. అనంతరం యువకులు ఒకరిపై మరొకరు ఎక్కి ఉట్లమాను ఎక్కడానికి పోటీపడ్డారు. పరుష చూడడానికి వచ్చిన భక్తులకు వేసవిని దృష్టిలో ఉంచుకుని పలువురు ఉచిత మజ్జిగ కేంద్రాలు, చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

బాబూ జగ్జీవన్రామ్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్రామ్ విగ్రహ ఏర్పాటుకు ఆదివారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన విగ్రహ దాత మోపిడి తిప్పయ్య, ఉరవకొండ అర్బన్ సిఐ హరినాథ్, సర్పంచి లలితమ్మ, జడ్పిటిసి ఎసి పార్వతమ్మ మాట్లాడుతూ నేటి యువతరం సమాజ సేవకు తమ జీవితాలను ఫణంగా పెట్టిన సంఘ సేవకులు జగ్జీవన్రామ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సంఘ సంస్కర్తల విగ్రహాలు ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిన మోపిడి తిప్పయ్యను విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తున్న ఎంఆర్పిఎస్ నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రాజు మాదిగ, కౌకుంట్ల రవి మాదిగ, అనంతపురం ప్రధాన కార్యదర్శి, బసవరాజు, గంగాధర్, ఎమ్మార్పీఎస్ ఉరవకొండ గౌరవాధ్యక్షులు వెలిగొండ ఓబయ్య, రాంపురం చెన్నప్ప, తాలూకా అధ్యక్షులు కౌకుంట్ల సురేష్, తాలూకా ప్రధాన కార్యదర్శి, రామాంజనేయులు, నియోజకవర్గ అధ్యక్షులు, ఆమిద్యాల మల్లప్ప, మండల అధ్యక్షులు ఆమిద్యాల రామన్న, మండల నాయకులు మల్లికార్జున, రమేష్, చిన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

జగ్గీవన్రామ్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న అర్బన్ సిఐ హరినాథ్, సర్పంచి లలితమ్మ, జడ్పిటిసి ఎసి పార్వతమ్మ

విలేకరులు కావలెను

ప్రజాశక్తి దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను.

విలేకరులు కావాల్సిన ప్రాంతాలు: అనంతపురం జిల్లా:
1.అనంతపురం అర్బన్ 2.అనంతపురం క్రైం, 3.అనంతపురం రూరల్ 4.కూడేరు 5.రాప్తాడు 6.వజ్రకరూర్ 7.పామిడి 8.కళ్యాణదుర్గం రూరల్ 9.కంబదూరు

శ్రీ సత్యసాయి జిల్లా: 1.హిందూపురం రూరల్ 2.పెనుకొండ రూరల్ 3.ధర్మవరం రూరల్ 4.పుట్టపర్తి కలెక్టరేట్ 5.పుట్టపర్తి క్రైం 6.కొత్తచెరువు రూరల్ 7.ముదిగుబ్బ రూరల్ 8.ఓ.డి. చెరువు రూరల్, 9.తాడిమర్రి 10.రొళ్ల. 11.అమడగూరు 12.గోరంట్ల రూరల్.

విద్యార్హత: 10వ తరగతి లేదా ఇంటర్ పాస్/ఫెయిల్

ఇంటర్వ్యూ తేది: 03-04-2023



అడ్రస్:
పాత విఆర్ఎల్ ట్రాన్స్పోర్టు గొడౌన్, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, బళ్లారిరోడ్డు, అనంతపురం.
సెల్: 9490099311, 9490099312.

రమాదేవి హత్య కేసులో నిర్లక్ష్యం వహించిన

సిఐ, ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి: కెవిపిఎస్

ప్రజాశక్తి-నార్పల

రమాదేవి హత్య కేసును విచారించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న శింగనమల సిఐ, నార్పల ఎస్ఐలపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, జిల్లా అధ్యక్షులు వెంకటేష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నార్పల మండలం బొందలవాడ గ్రామానికి చెందిన దళిత యువతి కడపల రమాదేవి ఈనెల 4న కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతోనే 20 రోజుల తర్వాత హత్యకు గురైన విషయం తెలిసిందన్నారు. పోలీసులు చేసిన నిర్లక్ష్యం కారణంగానే దళిత యువతిని కోల్పోయాన్నారు. అంతేగాకుండా నిందితుడు నడిమిదొడ్డి గ్రామానికి చెందిన జాఫర్ను విచారించి చర్యలు తీసుకోవడంతో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిఐ, ఎస్ఐలపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కడవల రమాదేవిని ఈనెల 4న నడిమిదొడ్డికి చెందిన జాఫర్ పెళ్లి చేసుకుంటానని తీసుకెళ్లి అదేరోజు హత్య చేశాడన్నారు. 6వతేదీన నార్పల పోలీసుస్టేషన్లో రమాదేవి తండ్రి నారాయణస్వామి ఫిర్యాదు చేస్తే క్రైం నెంబర్ 35/2023 కింద కేవలం మిస్సింగ్ కేసుగా నమోదు చేసి నిందితుడిని తూతూమంత్రంగా పోలీసులు విచారించి వదిలేశారన్నారు. అప్పుడే జాఫర్పై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. యువతి బుక్కరాయసముద్రం చెరువులో శవమై తేలాక తల్లిదండ్రులతో, దళిత సంఘాలు ఆందోళన చేస్తేగానీ పోలీసులు స్పందించలేదన్నారు. అంతేగాకుండా కలెక్టర్ను తప్పుదోవ పట్టించేందుకు కూడా యత్నించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రమాదేవి కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సిఎం జగన్ పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని విడపనకల్లు మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూలు వద్ద ఐకెపి ఎపిఎం ఆంజనేయులు ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ఆసరా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని సిఎం జగన్ నెరవేరుస్తోందన్నారు. సంక్షేమ పథకాల అమలుతోనే పేదరిక నిర్మూలన సాధ్యమన్నారు. ఎన్నికలకు ముందు తీసుకున్న డ్వాక్రా రుణాల మాఫీకి ఇప్పటి వరకు తమ ప్రభుత్వం మూడు విడతల్లో రూ.19 వేల కోట్లు మహిళల ఖాతాల్లో జమ చేసిందని గుర్తు చేశారు. మాజీ సిఎం చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసిన పాదయాత్రలో డ్వాక్రా మహిళల రుణాలు మొత్తం మాఫీ చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేశాడని విమర్శించారు. అదే జగన్ తాను చేసిన పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కరణం పుష్పావతి భీమ్రెడ్డి, జెడ్పిటిసి హనుమంతు, వైస్ ఎంపిపి సునీత రాణి, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, ఎంపిడిఒ శ్రీనివాసులు, తహశీల్దార్ బ్రాహ్మయ్య, వైసిపి మండల కన్వీనర్ బసన్న, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్రెడ్డి, నాయకులు కరణం భీమిరెడ్డి, దేశాయ్ సిద్ధార్థ, గిరిబాబు, సుంకన్న, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు ఆసరా మెగా చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

విప్లవయోధుడు ముడార్ వేణుగోపాల్కు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం



ప్రజాశ్రేయస్సు కోసం ఆనాటి పాలకులకు వ్యతిరేకంగా గళమెత్తిన విప్లవయోధుడు ముడార్ వేణుగోపాల్ చిరస్మరణీయుడని పలువురు వక్తలు కొనియాడారు. ముడార్ వేణుగోపాల్ జయంతిని పురస్కరించుకుని జట్టి జయరాం అధ్యక్షతన ఆదివారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పటి ప్రభుత్వం నిర్బంధించి జైలుకు పంపించడంతోపాటు ఉద్యోగాల నుండి తొలగిస్తే వారి కోసం పోరాడిన తీరు నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అంతేగాకుండా ఎమర్జెన్సీ కాలంలో ప్రజా పోరాటాలు చేస్తున్న వారి కుటుంబ సభ్యుల ఆవేదన ఎలా ఉందో వివరించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. అంతకుముందు అక్షయ ఆలపించిన గీతం అలరించింది. అనంతరం ముడార్ వేణుగోపాల్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కవితా పోటీలో విజేతలైన వారికి ఉగాది పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కవులు డాక్టర్ రాధేయ, నబిరసూల్, ఆనాటి విప్లవ సహచరులు లోచర్ల విజయభాస్కర్రెడ్డి, ఆలీఖాన్, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు అబ్దుల్ సత్తార్, మానవ హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు ఎస్ఎం బాషా, ప్రజాహిత సాహితి నిర్వాహకులు ముడార్ సుధీర్, మానవత సంస్థ తరిమెల అమర్నాథరెడ్డి, అనంత జరసం అధ్యక్షులు సాకే శ్రీహరి, జరసం కార్యదర్శి కొత్తపల్లి సురేష్, రియాజుద్దీన్, షరీఫ్, చెట్ల ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

మోడీ హటావో.. దేశ్కీ బచావో..

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్

ప్రజాశక్తి-గుంతకల్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా 'మోడీ హటావో.. దేశ్కి బచావో.. జగన్కి హటావో.. ఎపికి బచావో' అనే నినాదాలతో ఏప్రిల్ 14 నుంచి మే 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో పాదయాత్రలు చేసేందుకు నిర్ణయించినట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ అన్నారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, అభివృద్ధి నిరోధకాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఆందోళనలు చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కారణంగా దేశం తిరోగమనం వైపు తీసుకుపోతున్నారని ఆరోపించారు. ఆంధ్ర రాష్ట్రానికి పోలవరం ఒక జీవనాడి అన్నారు. పోలవరం156 అడుగుల ఎత్తుతోపాటు 196 టీఎంసీలు ఉండాలని, మార్చి 27,28 తేదీల్లో 26 జిల్లాల కలెక్టరేట్ దగ్గర ధర్నాలు చేపట్టేందుకు రాష్ట్ర పార్టీ నిర్ణయించినట్లు తెలిపారు. అదానీ కుంభకోణం రూ.12 లక్షల కోట్లు జరిగితే ప్రతిపక్ష పార్టీలు జాయింట్ కమిటీ వేయమని ప్రశ్నిస్తే కేంద్ర ప్రభుత్వం అవినీతి బయటపడుతుందని సమాధానం చెప్పకుండా ప్రశ్నించిన రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాగా రాయలసీమ జిల్లాలకు నీరు రాకుండా తుంగభద్ర జలాశయానికి అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మించడం దుర్మార్గమన్నారు. కర్ణాటకలో ఎన్నికల కారణంగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. మరోవైపు జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.9.50లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు, సిపిఐ నియోజవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సిపిఐ నియోజవర్గ సహాయ కార్యదర్శి బి.మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, మండల కార్యదర్శి రాము, తదితరులు పాల్గొన్నారు.

రమాదేవి కుటుంబానికి న్యాయం చేయాలి

నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి, నార్పల

దళిత యువతి రమాదేవిని హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించి ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి బండారు శ్రావణిశ్రీ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం మండలంలోని బొందలవాడలో ఉన్న రమాదేవి తలిదండ్రులను పరామర్శించి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రమాదేవి కనిపించకుండా పోయిందని నార్పల పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేస్తే 20 రోజులు నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. పోలీసులు సకాలంలో స్పందించి ఉంటే బాధిత కుటుంబానికి అప్పుడే న్యాయం జరిగి ఉండేదన్నారు. రమాదేవి చావుకు కారణమైన నార్పల ఎస్ఐతోపాటు సిఐని వెంటనే విధుల నుంచి తొలగిండంతోపాటు ఫాస్ట్ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. అలాగే రమాదేవి కుటుంబానికి రూ.50లక్షల పరిహారం చెల్లించి నిందితుడిని ఉరితీయాలన్నారు. కాకా వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దశ, దిశ లేకుండా జగన్రెడ్డి పాలన సాగుతోందని విమర్శించారు. ముఖ్యంగా రాష్ట్రంలో అణగారిన వర్గాల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్ స్పందించి మహిళలకు రక్షణ కల్పించడంతోపాటు అణగారిన వర్గాలకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బండారు శ్రావణిశ్రీ

బొలెరో బోల్తా.. యువకుడి మృతి

మరో నలుగురికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని బొమ్మలాటపల్లి గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. మరో నలుగురు గాయపడ్డారు. సిఐ అస్రార్బాషా తెలిపిన వివరాల మేరకు... బత్తలపల్లి నుంచి నార్పల వైపు వస్తున్న బొలోరో వాహనం బొమ్మలాటపల్లి వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో నార్పల కొత్త బస్టాండ్ కాలనీకి చెందిన సురేంద్ర (23) అక్కడికక్కడే మృతిచెందాడు. దిలీప్తోపాటు మరో ముగ్గురు గాయపడ్డారు. వెంటనే స్థానికులు 108 ద్వారా ఆసుపత్రికి తరలించారు. వీరిలో దిలీప్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న సిఐ అస్రార్బాషా, ఎస్ఐ రాఘవరెడ్డి, హెచ్కానిస్టేబుల్ చలపతి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. కాగా వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుల్లాయప్ప ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

మృతిచెందిన సురేంద్ర

కంటి ఆపరేషన్ బాధితులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ శ్రీవాణి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణంలో దివంగత మాజీ ఎమ్మెల్యే వసికేరి గోపీనాథ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 8న ఆపరేషన్లు చేసిన వారికి ఆదివారం మరోసారి వైద్య పరీక్షలు నిర్వహించారు. నంద్యాలకి చెందిన శాంతారం ఆసుపత్రి నిర్వాహకులు ఆపరేషన్లు చేశారు. ఆపరేషన్లు చేయించుకున్న వృద్ధుల కంటి పరిస్థితి ఎలా ఉందని తెలుసుకోవడానికి ఆదివారం శాంతారామ్ ఆసుపత్రి వైద్య సిబ్బంది ఉరవకొండకి వచ్చి పరీక్షించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ వసికేరి మల్లికార్జున దాదాపు 150 మంది వృద్ధులకు ఉచితంగా మందులు అందించడమే కాకుండా భోజనం ఏర్పాట్లు కూడా కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛారిటబుల్ ట్రస్టు వైస్ ఛైర్మన్ మల్లికార్జున, శాంతారాం ఆసుపత్రి సిబ్బంది, శ్రీవాణి విద్యానికేతన్ కరస్పాండెంట్ రఘురాములు, ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

పేద ముస్లిములకు సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-రాయదుర్గం

వట్టణానికి చెందిన ముల్ల రఫీక్ అహ్మద్ (రిటైర్డ్ తహశీల్దార్) తండ్రి ముల్లా మాబుసాబ్ జ్ఞాపకార్థం పట్టణంలోని పాపభట్ల వీధిలో నిరుపేద ముస్లిములకు ఆదివారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఖాజీ సైపుల్లాసాబ్, అధ్యాపకులు అయూబ్ ఖాన్, గుండ్లపల్లి మజీద్ హాజరై 150 మంది నిరుపేద ముస్లిములకు ఒక్కొక్కరికి రూ.1100 విలువజేసే సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రఫీక్ అహమ్మద్, కుమారుడు సిరాజుద్దీన్, సోదరులు నజీర్ అహమ్మద్, ముల్లా రియాజ్ అహమ్మద్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిములకు తోఫా పంపిణీ చేస్తున్న దృశ్యం

దర్గాలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి ప్రార్థనలు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండల పరిధిలోని పెద్దయక్కలూరు గ్రామంలో ఉన్న దర్గాలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు పడి రైతులు, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం స్థానిక నాయకుడు ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

వెంకటరామిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఇటీవల మృతి చెందిన ఆత్మకూరు టెక్నికల్ అసిస్టెంట్ సద్దకూటి వెంకటరామిరెడ్డి కుటుం బానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్రెడ్డి భరోసా ఇచ్చారు. వెంకట రామిరెడ్డి పెద్దఖర్మను పురస్కరించుకుని గ్రామానికి చేరుకుని కుటుంబాన్ని పరామర్శించారు. ఆత్మకూరు మండలం వడ్డిపల్లి గ్రామానికి చెందిన వైసిపి ఐటీ విభాగం నాయకుడు బత్తల సుధీర్రెడ్డి తండ్రి బత్తల సుబ్బారెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వెంకటరామిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్రెడ్డి

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

ప్రజాశక్తి-అనంతపురం

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు సభ్యులు తనవ్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆదివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్పర్సన్ ఎస్.డాక్టర్ నిర్మలామురళి మాట్లాడుతూ మన కుటుంబ సభ్యులు శుభకార్యాలకు పేదల ఆకలి తీర్చడం సంతోషంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజుకు పేదలకు అన్నదానం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, ట్రస్టు సభ్యులు కవిన్ ఆదిత్య, సుబ్రహ్మణ్యం, కిష్టప్ప, ఓబుళపతి, నల్లప్ప, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్పర్సన్ ఎస్నిర్మలామురళి

'ప్రతి ఇంటికీ మన టిడిపి'

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్రెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని చాగల్లు గ్రామంలో టిడిపి నాయకులు వెంకటనారాయణరెడ్డి, చిన్నబాబు ఆధ్వర్యంలో ఆదివారం 'ప్రతి ఇంటికీ మన టిడిపి' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ ప్రజలు, రైతులు ఎవరూ అధైర్య పడవద్దని, వచ్చేది టిడిపి ప్రభుత్వమే అని అప్పుడు సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చాగల్లు సర్పంచి లలిత, శంకర్, సూరి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగల్లు గ్రామంలో పర్యటిస్తున్న టిడిపి నాయకులు